క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.60వేలు విరాళం



ఆలయ నిర్వాహకులను నగదు అందజేస్తున్న దాత

చిత్తూరు రూరల్: నగరంలోని న్యూబాలాజీ కాలనీలో నూతనంగా వెలసిన శ్రీ పంచముఖ వినాయకస్వామి దేవాలయ నిర్మాణానికి బుధవారం దాత పార్థసారథి నాయుడు రూ.60 వేలు విరాళం అందించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన గ్రానైట్‌ను అందిస్తానన్నారు. ఆలయ నిర్వాహకులు శక్తివేల్ స్వామి, మాధవనాయుడు, భానుమతి, అర్చకులు సాయిలు ఆయనను సన్మానించి స్వామి ఆశీర్వచనాలు అందించారు.

దేవుడి స్థలాన్ని కబ్జా చేశారు

చిత్తూరు రూరల్: తరతరాలుగా తమ కుల దైవం మునీశ్వరస్వామి ఆలయానికి, దారికి కేటాయించిన స్థలాన్ని చిత్తూరు రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే అరుణ కబ్జా చేసినట్లు చిత్తూరు రాంనగర్ కాలనీకి చెందిన సుజాత, రాధ, ఉమ, లలిత, మహేష్, దినేష్ ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆలయానికి పక్కనే స్థలమున్న మహేష్ ఇంటి స్థలాన్ని ఆ అరుణకు విక్రయించారన్నారు. ఆమె కొనుగోలు చేసిన స్థలంతో పాటు పక్కనే ఉన్న మునీశ్వర స్వామికి కేటాయించిన స్థలాన్ని అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపించారు. తమ పూర్వీకుల సమాధులను జేసీబీలతో ధ్వంసం చేశారని, దీనిపై పోలీసు, రెవెన్యూ అధికారులను ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

శ్రీనివాసశర్మకు సన్మానం



బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామానికి చెందిన ప్రముఖ పురోహితుడు, ఆల్ ఇండియా పురోహిత్ సేన గౌరవ సలహాదారు పాణ్యం శ్రీనివాసశర్మను బుధవారం కలెక్టర్ హరినారాయణన్ సన్మానించారు. ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా కలెక్టర్ పండితులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం రోజు జిల్లా కలెక్టర్ పండితులను సత్కరించడం సంతోషమన్నారు.

చిట్టడవిలో కొత్త రోడ్డు

ఆ గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావాలంటే చిట్టడవిలో బిక్కుబిక్కుమంటూ నడుచుకుంటూ రావాల్సిందే. ఇక రాత్రయితే ఎంత అత్యవసర పరిస్థితి అయినా రాకపోకలకు అవకాశమే ఉండదు. గత 50 సంవత్సరాలుగా పాలసముద్రం చుట్టు పక్కల ఉండే గ్రామాల ప్రజలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే నారాయణ స్వామి అక్కడ రోడ్డు వేయాలని గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఫలితం శూన్యం. రెండో సారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం అయ్యాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం రాష్ట్ర అటవీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో రోడ్డు మంజూరైంది. పనులు ప్రారంభమయ్యాయి.

- 50 ఏళ్ల సమస్యకు పరిష్కారం
- చురుగ్గా సాగుతున్న పనులు
- ఫలించిన నారాయణస్వామి కృషి



చిత్తూరు-పుత్తూరు రోడ్డు ఉడమలకుర్తి ప్రాంతంలో జరుగుతున్న హై లెవల్ బ్రిడ్జి పనులు



పాలసముద్రం మండలం అడవి మధ్యలో సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

చిత్తూరు కార్పొరేషన్: సుమారు 50 ఏళ్ల నాటి రోడ్డుకు మోక్షం వచ్చింది. దట్టమైన అడవిలో కొత్త రోడ్డు నిర్మాణానికి నోచుకుంది. ఎగువ, దిగువ వనదుర్గాపురం, చలమరాజుఇండ్లు, వనదుర్గాపురం ఆది ఆంధ్రవాడ, గంగామాంబపురం, తిరుమలరాజుపురం, నరసింహాపురం పల్లెల నుంచి మండల కేంద్రమైన పాలసముద్రంకు వెళ్లాలంటూ అడవి మార్గమే శరణ్యం. అర్ధరాత్రి అయినా, అత్యవసర పరిస్థితి అయినా ఇదే పరిస్థితి. బడి, గుడి, వైద్య సేవలకు వెళ్లాలంటే హంసపురం-టీవీఎస్‌పురం, రాచపాళెం-వనదుర్గాపురం వాసు లు 6 కిలోమీటర్లు దూరం రాకపోకలు సాగించాలి. అందులో అడవిలోనే సుమారు కిలోమీటర్లు ప్రయాణించాలి. చీకటి వేళ్ల వారి అవస్థలు చెప్పలేం. అత్తిమంజరిపేట మీదుగా బలిజకండ్రిగపై పాలసముద్రానికి చేరుకోవాలంటే దాదాపు 18 కిలోమీటర్లు ప్రయాణించాలి. తమిళనాడు షోళింగర్ మీదుగా రావాలంటే దాదాపు 30 కిలోమీటర్లు ఉంటుంది.

అటవీలో రోడ్డుకు అనుమతి వచ్చింది

సాధారణంగా అటవీ ప్రాంతంలో రోడ్డు వేయడానికి అనుమతి లేదు. అయితే 1980కు ముందు నుంచి నడక మార్గం ఉంటే అక్కడ రోడ్డు వేయవచ్చని అటవీశాఖ చట్టంలో ప్రభుత్వం ఇటీవల సవరణలు చేసింది. దీంతో మొదటి నుంచి ఈ రోడ్డు కోసం పోరాడుతున్న నారాయణస్వామి ప్రయత్నం ఫలించింది. సీఎంఓ, అటవీశాఖాధికారులతో చర్చించి అక్కడ రోడ్డు మంజూరు చేసుకున్నారు. ఈ క్రమంలోనే హంసపురం-టీవీఎస్ పురం 1.2 కిలోమీటర్లు రూ.1.8 కోట్లు, రాచపాలెం-వనదుర్గాపురం 3.15 కిలోమీటర్లు రూ.3 కోట్లు నిధులు బీటీరోడ్డుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రాచపాలెం రోడ్డు పనులు టెండర్ దశలో ఉండగా టీవీఎస్ పురం రోడ్డు నిర్మాణ పనులు దాదాపు తుదిదశకు చేరింది. దీంతో చుట్టు ఉన్న 10 వేల మంది గ్రామీణులు హాయిగా రాకపోకలు సాగించనున్నారు.



- చిత్తూరు పుత్తూరు రోడ్డు మార్గంలో ఉడమలకుర్తి ప్రాంతంలో హై లెవల్ బ్రిడ్జి (400 మీటర్లు) రూ.27 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు మొదలయ్యాయి.
- పెనుమూరు క్రాస్ నుంచి పెనుమూరు వరకు 16 కి.మీ దూరానికి రూ.5.50 కోట్లు
- తిరుపతి -కొత్తపల్లెమిట్ట మార్గం 27.62 కి.మీ దూరానికి రూ.8 కోట్లు,
- జీడీనెల్లూరు - బలిజకండ్రిగ 7.5 కి.మీ దూరానికి రూ.3.5 కోట్లు,
- రాచపాలెం-వనదుర్గాపురం 2.75 కి.మీ దూరానికి రూ.90 లక్షలు,
- దొడ్డిపల్లె-చిత్తూరు-పుత్తూరు రోడ్డు 5.4 కి.మీ దూరానికి రూ.1.7 కోట్లు,
- ఇజ్జుపల్లె-దామలగుంట 5 కి.మీ దూరానికిరూ.1.20 కోట్లు

ఇలా మొత్తం 64.27 కిలోమీటర్లు రోడ్డు రెన్యూవల్ కోసం రూ.20.80 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు.

ప్రజల కోసం



అటవీ ప్రాంతంలో రోడ్డు వేస్తే గ్రామీణుల ప్రయాణానికి అవస్థలు తప్పుతాయి. గత పాలనలో కేంద్ర అటవీశాఖ అనుమతులు ఇవ్వలేదు. అనంతరం కేంద్ర అటవీ చట్టంలో సవరణలు చేశారు. రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి రోడ్డు పనులు మంజూరు చేయించాం. దాదాపు 10 వేల మంది గ్రామీణుల కష్టం ఇక తీరనుంది.

– నారాయణస్వామి, డిప్యూటీ సీఎం

ఎంతో ఉపయోగం



నూతన రోడ్డు మార్గం గ్రామీణ వాసులకు ఎంతో అనువుగా మారనుంది. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాచపాలెం రోడ్డు పనులు టెండర్ దశలో ఉంది. వీటితో పాటు హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. పలు రోడ్ల రెన్యూవల్ కోసం ప్రతిపాదనలు అందించాం.

– దస్తగిరి, డీఈ, ఆర్ అండ్‌బీ

రోడ్డు వేస్తున్నారు



వనదుర్గాపురం పంచాయతీకి నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే ఏళ్లుగా దూర ప్రయాణం చేస్తున్నాం. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో అటవీ ప్రాంతంలో రోడ్డు వేస్తున్నారు. మా ఊరి వాళ్లు పది నిమిషాల వ్యవధిలో మండల కేంద్రానికి చేరుకోవచ్చు.

– దొరస్వామిరాజు, ఎలక్ట్రీషియన్, చలమరాజిండ్లు, వనదుర్గపురం

కల నెరవేరింది



ఎన్నో సంవత్సరాలుగా మా ప్రాంతం నుంచి మండలానికి పోవాలంటే రోడ్డులేకపోవడం పెద్ద సమస్యగా మారింది. అనుకున్న సమయానికి చేరాలంటే గంట ముందు ఇంటి నుంచి వెళ్లాలి. ఏదైనా మరిచిపోతే రాను పోను రెండు గంటలు సమయం వృథా అవుతుంది. ఇప్పుడు మా కల నెరవేరింది. ఈ రోడ్డు నిర్మాణంతో చకచకా వెళ్లి రావచ్చు.

– యువరాజు, రైతు, టీవీఎస్‌ఆర్ పురం

సౌకర్యంగా ప్రయాణం



పల్లెవాసులు అటవీ ప్రాంతం నుంచి విద్య, వైద్యం, ఉద్యోగం ఇలా దేని కోసమైనా అటవీ మార్గంలోనే ప్రయాణించాల్సి వచ్చింది. 1980కు ముందు ఉన్న నడకమార్గం రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇచ్చింది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి కృషి ఫలితమే ఇది. మంత్రి పెద్దిరెడ్డి సహకారం అభినందనీయం.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌ఓ

తిరుచ్చిపై వేణుగోపాలుడి చిద్విలాసం



తిరుచ్చిపై ఊరేగుతున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

కార్వేటినగరం: మండలకేంద్రంలోని ప్రసిద్ధి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారు బుధవారం ఉగాది ఉత్సవాల్లో భాగంగా తిరుచ్చి వాహనంపై గ్రామవీధుల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులకు పండితులు వేద మంత్రాలు పఠిస్తూ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం 4 గంటలకు వేదపడింతులు పంచాంగ శ్రవణం పఠించారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీ వేణుగోపాలస్వామి వారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి గ్రామ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8.30 ఏకాంతసేవ నిర్వహించి స్వామివారిని పవళింపజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఏకాంబరం, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు గోపాలాచారి, కిరణ్‌భట్టాచార్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు... ఆనందాల లోగిళ్లు

అంగన్‌వాడీ కేంద్రాలు ఆనంద నిలయాలుగా మారాయి. చిన్నారుల ఆరోగ్యానికి పూచీలుగా నిలుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరింత మెరుగ్గా తీర్చిదిద్దడంతో ఎలాంటి భయం లేకుండా చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపుతున్నారు. పౌష్టికాహారంతో పాటు సృజనాత్మకతతో విద్యను నేర్పిస్తుండడంతో చిన్నారులు ఉత్సాహంగా కేంద్రాలకు వస్తున్నారు.



అంగన్‌వాడీలో పిల్లలకు పాఠాలు చెబుతున్న టీచర్



పిల్లలకు డ్యాన్స్ నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్

గుడిపాల: మండలంలో 70 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 68 అంగన్‌వాడీ టీచర్లు 46 మంది ఆయాలున్నారు. 3 నుంచి 6 నెలల వరకు (ప్రి స్కూల్) చిన్నారులు 790 మంది, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 1132 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్నారు. వీరితో పాటు 250 మంది గర్భిణులు, 270 మంది తల్లులకు అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహారంతోపాటు వివిధ సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులకు ఆట పాటలతో విద్యాబోధన చేస్తున్నారు. పిల్లల్లో శారీరక, మానసిక నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. కథలు చెప్పడం ద్వారా పిల్లల్లో ఆలోచనా శక్తిని పెంపొందింపచేస్తున్నారు. బొమ్మలు, వివిధ ఆకృతులతో సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. ఇంగ్లీషు, లెక్కలు, డ్రాయింగ్ నేర్పిస్తున్నారు. దీంతో పిల్లలందరూ ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

ఇష్టంగా పంపుతున్నారు



అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను తల్లిదండ్రులు ఎంతో ఇష్టంగా పంపుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం తనిఖీచేసి కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి.

– అనురాధ, సూపర్‌వైజర్, గుడిపాల

ఆటపాటలతో విద్య



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఒత్తిడి లేకుండా ఆటపాటలతో విద్యను నేర్పిస్తున్నాం. పౌష్టికాహారం అందిస్తున్నాం. ప్రతినెలా పిల్లల బరువును కొలుస్తున్నాం. వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాం. ఇంటిలో ఉండే విధంగానే అంగన్‌వాడీలో కూడా ఉండే విధంగా చూసుకుంటున్నాం.

– బుజ్జి, అంగన్‌వాడీ టీచర్, గుడిపాల

అర్ధగిరి క్షేత్రంలో పంచాంగ పఠనం

- అంతటా ఉగాది సంబరాలు
- ఆలయాల్లో పంచాంగ పఠనం
- తరలి వచ్చిన భక్తులు



ఐరాల : విశేష అలంకరణలో పాలేటమ్మ



యాదమరి: శ్రీ కొమ్మే పెళ్లమ్మ దేవస్థానం వద్ద అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న గ్రామస్తులు



అర్ధగిరిలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి



చిత్తూరు: ఆలయంలో పంచాంగం చదువుతున్న అర్చకులు



చిత్తూరు: దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో అర్చకులు తెలుగు నూతన శోభ కృత్ నామ సంవత్సరం, తెలుగువారి సంప్రదాయాలకు ప్రతి రూపమైన ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణాన్ని పఠనం చేశారు. మండలంలోని పలు దేవాలయాల్లో అర్చకులు, భక్తులు ఉగాది పండుగను ఆనందంగా నిర్వహించారు. అర్ధగిరి క్షేత్రంలో ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వీరాంజనేయస్వామికి అభిషేకం, అర్చనలు, పూజలు చేయించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు నూతన తెలుగు సంవత్సర పంచాంగం చదివి వినిపించారు. టి.పుత్తూరు శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి, కార్యనిర్వాహకులు శంకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు నిర్వహించి అర్చకులు పంచాంగ పఠనం చేయించారు. అనంతరం భక్తులకు తీపు, చేదు, పులుపుతో కూడిన పచ్చడి పంచిపెట్టారు.

సాంస్కృతిక ప్రదర్శనలు

యాదమరి: మండలంలోని గ్రామాలలో వెలసిన భజన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఎర్రచేను గ్రామంలోని అటవీప్రాంతంలో వెలసిన కొమ్మేపెళ్లమ్మ ఆలయంలో ఉగాది సందర్భంగా బుధవారం అమ్మవారిని కొలువు తీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం వద్ద ఉదయం రాత్రి వరకు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ చైర్మన్ టి.పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

పాలేటమ్మ ఆలయంలో

ఐరాల: మండల కేంద్రంలోని పాలేటమ్మ ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బెల్లం పొంగలి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ నిర్వాహకులు షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు.

బంగారుపాళెం: మండలంలో ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. మొగిలి శివాలయం, మొగిలి వెంకటగిరిలోని శ్రీకోదండరామాలయం, నలగాంపల్లెలోని శ్రీభూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయం, వజ్రాలపురంలోని జలకంఠేశ్వర స్వామి ఆలయం, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కొత్త సంవత్సరంలో సర్వశుభాలు కలగాలని భక్తులు పూజలు చేపట్టారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. మొగిలి శివాలయం, బంగారుపాళెం ముత్యాలమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటింటా ఉగాది

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో బుధవారం ఇంటింటా ఉగాది పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. దుర్గమ్మ ఆలయం, కోదండరామస్వామి ఆలయం, అగస్తీశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాలను మామిడి ఆకుల తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి దర్శనార్థం కోసం భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. వచ్చిన భక్తులకు ఆయా ఆలయ అర్చకులు స్వామి దర్శనభాగ్యం కల్పించి స్వామి ప్రసాదంతో పాటు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పంచాంగ శ్రావణం చేశారు. రాశుల వారీగా జరిగే మంచి చెడులను వివరించారు.

కవులకు సన్మానం

చిత్తూరు రూరల్: సకల శుభాలకు ఆది తెలుగు సంవత్సరాది ఉగాది అని రచయితల సంఘ అధ్యక్షురాలు రామలక్ష్మి అన్నారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు భవనంలో బుధవారం సంఘ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. 20 మంది కవులను సన్మానించారు. అనంతరం కవిత గానం చేశారు. కార్యక్రమంలో కట్టమంచి బాలక్రిష్టారెడ్డి, గిరిధరన్, జయచంద్ర, అరుణకుమారి, మునస్వామి, శ్రీనివాసులు, బాలరాజు, హరిక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.